


జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట

గురువారం, ఆగస్టు 6, 2026 | పేజీలు: 7


### ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా ప్రత్యామ్నాయ

# పంటలను ప్రోత్సహించాలి

**– తాగునీటికే తొలి ప్రాధాన్యం... రైతులకు వాస్తవ పరిస్థితులు ముందుగానే వివరించాలి: ప్రత్యేక అధికారి వి.పి. గౌతమ్**




మహబూబ్‌నగర్, ఆగస్టు 5 ( ప్రజా జ్యోతి బ్యూరో ): ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో రానున్న రోజుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటల సాగును రైతులు చేపట్టేలా విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ఎల్‌నినో ప్రత్యేక అధికారి, గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్, కార్యదర్శి వి.పి. గౌతమ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయ, నీటిపారుదల, ఉద్యానవన, మిషన్ భగీరథ, ప్రణాళిక శాఖల అధికారులతో ఎల్‌నినో పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళిక, వర్షపాతం, పంటల సాగు, నీటి లభ్యతపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.

**81 వేల ఎకరాలకు పైగా సాగు విస్తీర్ణం తగ్గే అంచనా:** జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ ఖరీఫ్‌లో సాగు పరిస్థితులను వివరించారు. గత ఏడాది 3,91,320 ఎకరాల్లో సాగు జరగగా, ఈ ఏడాది అది 3,09,643 ఎకరాలకు పరిమితమయ్యే అవకాశముందని, అంటే 81,685 ఎకరాల మేర సాగు తగ్గవచ్చని తెలిపారు. గత ఏడాది 2,32,169 ఎకరాల్లో సాగైన వరి ఈసారి సుమారు 1,65,000 ఎకరాలకు తగ్గే అవకాశం ఉందని చెప్పారు. ఈ తగ్గుదల నేపథ్యంలో శాస్త్రవేత్తల సూచనల మేరకు కంటింజెన్సీ ప్రణాళిక రూపొందించి రైతులను తక్కువ నీటి అవసరమున్న

### గిరిజన పిల్లలు విద్యకు

# దూరం కాకూడదు

- చెంచు కుటుంబాలకు నాణ్యమైన వైద్యం అందించాలి
- గిరిజన పాఠశాలలలో మౌలిక వసతులు కల్పించాలి
- ప్రతి కుటుంబానికి అభివృద్ధి ఫలాలు అందాలి
- మానవహక్కుల కమీషన్ చైర్మన్ శమీమ్ అఖ్తర్



నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 05 (ప్రజా జ్యోతి) నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని నల్లమల్ల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న చెంచు గిరిజనుల జీవన ప్రమాణాలు, విద్య, వైద్య సేవలు,ప్రభుత్వ సంక్షేమకార్యక్రమాల అమలు,ఉపాధి అవకాశాలు,మౌలిక సదుపాయాలపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్.జస్టిస్ షమీమ్ అక్తర్ క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేశారు.నాగర్ కర్నూల్ జిల్లా పర్యటనలో భాగంగా అచ్చంపేట నియోజకవర్గంలోని నల్లమల్ల ప్రాంతాన్ని సందర్శించి గిరిజన వాస్తవపరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించి ప్రభుత్వ శాఖల పనితీరుపై అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించి అడవిలోని మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న చెంచు కుటుంబాలకు

### భూసేకరణ ఆటంకాలను

# త్వరగా తొలగించాలి

**నాగర్ కర్నూల జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**



**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 05 (ప్రజా జ్యోతి)** జిల్లాలో అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణలో ఎదురవుతున్న ఆటంకాలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజె క్టుల

### టియుఎఫ్ఐడిసి, యుఎఫ్‌సి నిధులతో చేపడుతున్న అభివృద్ధి

# పనులను వేగవంతం చేయాలి

**– వ్యర్థాల శుద్ధి ప్లాంట్లు, బయో మైనింగ్, తాగునీటి పనులు గడువులోగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**



**మహబూబ్‌నగర్, ఆగస్టు 5 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** జిల్లాలోని మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థతో పాటు జడ్చర్ల, దేవరకద్ర, భూత్పూర్ మున్సిపాలిటీలలో టియుఎఫ్ఐడిసి, మరియు, యు ఎఫ్ సి నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ, జడ్చర్ల, దేవరకద్ర, భూత్పూర్ మున్సిపాలిటీల్లో అమలవుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా

## ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా ప్రత్యామ్నాయ

# పంటలను ప్రోత్సహించాలి

పంటల వైపు మళ్లిస్తున్నామని తెలిపారు.వరి, పత్తిపై ఎల్‌నినో ప్రభావం ఎక్కువ పంటల వారీగా పరిశీలిస్తే వరి, పత్తి సాగు గణనీయంగా తగ్గే అవకాశం ఉండగా, కంది సాగు పెరిగే అవకాశముందని, మొక్కజొన్న సాగు కూడా తగ్గుతుందని అధికారులు వివరించారు. ఎల్‌నినో ప్రభావం ప్రధానంగా వరి, పత్తి పంటలపైనే కనిపిస్తోందని తెలిపారు.

సాధారణ వర్షపాతమే... కానీ నీటి వినియోగంలో జాగ్రత్త అవసరం

ఈ ఏడాది వర్షపాతం సాధారణం కంటే 11.4 శాతం తక్కువ నమోదైనా, ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు కోలుకున్నాయని అధికారులు తెలిపారు. అయితే చెరువుల ఆయకట్టు, బోర్ల ఆధారిత తక్కువ ఎత్తులోని భూముల్లో రైతులు ఇప్పటికీ వరి సాగుకే మొగ్గు చూపుతున్నారని వివరించారు.

దీర్ఘకాలిక వ్యూహంతో పంటల మార్పు అవసరం

దీనిపై స్పందించిన ప్రత్యేక అధికారి వి.పి. గౌతమ్, మెట్టు భూముల్లో సాధ్యమైనంత వరకు ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. ఎల్‌నినో ఒక ఏడాది సమస్య కాదని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రైతులను కంది, రాగులు, ఆముదం, ఉలవలు, కూరగాయలు వంటి తక్కువ నీటి అవసరమున్న పంటల వైపు మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు పంటలు మార్చాలంటే కేవలం సూచనలు సరిపోవని, విత్తనాల లభ్యత, సబ్సిడీలు, మార్కెటింగ్, కొనుగోలు, ధరల భరోసాపై కూడా స్పష్టమైన అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఉద్యాన పంటలకు ప్రాధాన్యం:

కూరగాయల సాగు విస్తరణకు మల్చింగ్, డ్రిప్ ఇరిగేషన్, ఉద్యాన పథకాల కింద సబ్సిడీలను విస్తృతంగా అందించాలని గౌతమ్ సూచించారు. టమాట, పచ్చిమిర్చి, క్యాప్సికం, కందులు వంటి పంటల విత్తనాలతో పాటు మల్చింగ్ షీట్లు, పోల్స్, బ్రాకెట్లు వంటి సామగ్రిని రైతులకు అందుబాటులో ఉంచుతున్నట్లు ఉద్యాన శాఖ అధికారులు వివరించారు. వ్యవసాయ భూములను ఉద్యాన పంటల వైపు మళ్లించే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామని, డ్రిప్ ఇరిగేషన్, ఆయిల్ పామ్, పండ్ల తోటల విస్తరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద గరిష్ట సబ్సిడీలు అందిస్తున్నామని తెలిపారు.

ఆయిల్ పామ్ సాగుపై ప్రత్యేక దృష్టి:

ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతున్నప్పటికీ భూగర్భ జలాల కొరత ప్రధాన సవాల్‌గా ఉందని అధికారులు తెలిపారు. దీనిపై స్పందించిన గౌతమ్, పంటల వైవిధ్యీకరణ బాధ్యతను వ్యవసాయ శాఖ కూడా సమానంగా తీసుకోవాలని, ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తన పరిధిలో లక్ష్యాలు నిర్దేశించుకుని రైతులను ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగు వైపు ప్రోత్సహించాలని ఆదేశించారు.

తాగునీటికే తొలి ప్రాధాన్యం:

అనంతరం ఇరిగేషన్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ప్రస్తుతం కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో 0.6 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 2.27 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ఉన్న నిల్వలు తాగునీటి అవసరాలకు మాత్రమే సరిపోతాయని వివరించారు.

ఈ పరిస్థితుల్లో సాగునీటి విడుదల సాధ్యం కాదని, తాగునీటికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని గౌతమ్ స్పష్టం చేశారు. ఇటీవల వర్షాలు కురుస్తున్నాయనే కారణంతో రైతులు సాగునీరు వస్తుందనే ఆశతో అధిక విస్తీర్ణంలో పంటలు వేయరాదని సూచించారు.

రైతు వేదికల ద్వారా విస్తృత అవగాహన:

ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా ఆయకట్టు గ్రామాల్లో రైతు వేదికల ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రస్తుత నీటి లభ్యత, సాగునీటి పరిమితులపై రైతులకు స్పష్టంగా వివరించాలని, వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, గ్రామస్థులతో సమావేశాలు నిర్వహించి ఈ సీజన్‌లో సాగునీటిపై ఆధారపడకుండా తీర్మానాలు చేయించాలని సూచించారు. గతంలో అనుమతి లేకుండా రిజర్వాయర్ షట్టర్లు తెరిచి నీటిని విడుదల చేసిన ఘటనలను ప్రస్తావిస్తూ, అలాంటి చర్యల వల్ల తాగునీరు వృథా అవుతుందని పేర్కొన్నారు. అవసరమైతే షట్టర్ల వద్ద భద్రత, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ముందుగా తాగునీటి అవసరాలను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని, రైతులకు వాస్తవ పరిస్థితులను ఇప్పుడే తెలియజేస్తే భవిష్యత్తులో అనవసర సమస్యలు, ఆందోళనలు నివారించవచ్చని వి.పి. గౌతమ్ తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, డీఆర్వో ఎ. నిర్మల, ఆర్డీవో నవీన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, ఉద్యానవన శాఖ అధికారి వేణుగోపాల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## భూసేకరణ ఆటంకాలను

# త్వరగా తొలగించాలి

భూసేకరణ పురోగతిపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్నినిర్వహించి జిల్లాలో కొనసాగుతున్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని,ప్రాజెక్టుల భూ సేకరణను ప్రత్యేక దృష్టితో పరిష్కార చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ శాఖల అధికారులను ఆదేశించారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని భూసేకరణ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించడంతో పాటు ప్రతి నిబంధనలను కచ్చితంగా పాటించాలని,భూసేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోపు పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.పాలమూరు--రంగారెడ్డి,మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల,డిండి రిజర్వాయర్,అచ్చంపేట ఎత్తిపోతల పథకం,మిషన్ భగీరథ భూసేకరణ,అవార్డులజారీ,రైతులకు పరిహారం,పెండింగ్ కేసులు,వివాదాస్పద భూములు తదితర అంశాలపై రెవెన్యూ, నీటిపారుదల సమీక్ష నిర్వహించి

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పరిధిలో ప్రస్తుతం కేవలం 51 ఎకరాల 10 గుంటల భూసేకరణ పెండింగ్‌లో ఉందని అధికారులు వివరించారు.ఈ నేపథ్యంలో మిగిలిన భూసేకరణ ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేసి ప్రాజెక్టు పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని ప్రతి పెండింగ్ కేసును ప్రత్యేకంగా పరిశీలించి,రైతులతో చర్చలు జరిపి,ప్రక్రియలను వేగవంతం చేయాలని, అచ్చంపేట ఎత్తిపోతల పథకం పరిధిలో సుమారు 2,588 ఎకరాల భూసేకరణ కొనసాగుతున్నట్లు అధికారులనడిగి తెలుసుకున్న కలెక్టర్,ఎక్కడైనా సమస్యలు ఉంటే వాటిని ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని,భూసేకరణలో ఎదురవుతున్న సాంకేతిక,పరిపాలనా,న్యాయపరమైన సమస్యలను గుర్తించి,శాఖల సమన్వయంతో పరిష్కరించాలని,రైతులతో నిరంతర సంప్రదింపులు జరుపుతూ సందేహాలను నివృత్తి చేసి భూసేకరణను సాఫీగా పూర్తి చేయాలన్నారు.మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పరిధిలో పెండింగ్లో ఉన్న 200 ఎకరాల భూసేరణపై ప్రత్యేకంగా సమీక్షించి పనుల్లో జాప్యం లేకుండా ప్రతి దశను వేగవంతం చేయాలన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చెన్నయ్య, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అరుణ రెడ్డి, మాధవి,డిప్యూటీ కలెక్టర్లు అశోక్,హర్షవర్ధన్,సాగునీటి ప్రాజెక్టుల ఇంజినీర్లు అమర్ సింగ్,రాములు, కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి,భూ సేకరణ సూపరింటెండెంట్ నారాయణ,రెవెన్యూ,ఇరిగేషన్ శాఖఅధికారులు పాల్గొన్నారు.

## టియుఎఫ్ఐడిసి, యుఎఫ్‌సి నిధులతో చేపడుతున్న అభివృద్ధి

# పనులను వేగవంతం చేయాలి

ఆమె మాట్లాడుతూ, ప్రతి మున్సిపాలిటీలో వ్యర్థాల శుద్ధి (వెస్ట్ ట్రీట్‌మెంట్) ప్లాంట్ల ఏర్పాటు, లెగసీ వ్యర్థాల తొలగింపునకు చేపడుతున్న బయో మైనింగ్ పనులు, ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణ, అలాగే తాగునీటి సరఫరా అభివృద్ధి పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా టియుఎఫ్ఐడిసి, యు ఎఫ్ సి నిధులతో చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను వెంటనే గ్రౌండింగ్ చేసి, ఎక్కడా జాప్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మున్సిపాలిటీలో జరుగుతున్న పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ గిరీష్, దేవరకద్ర మున్సిపల్ కమిషనర్ నరేష్, భూత్పూర్ మున్సిపల్ కమిషనర్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

# "సురక్షా కా తిరంగా"తో సైబర్ నేరాలపై అప్రమత్తత పెంచాలి

**- ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్లు, డిజిటల్ అరెస్ట్, ఫేక్ యాప్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించిన జిల్లా ఎస్పీ జానకి**



**మహబూబ్‌నగర్, ఆగస్టు 5 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో, అదే స్థాయిలో సైబర్ నేరగాళు కూడా కొత్త కొత్త పద్ధతులతో ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి సైబర్ భద్రతా నియమాలను పాటించాలని జిల్లా ఎస్పీ దరావత్ జానకి సూచించారు.తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ ఆదేశాల మేరకు ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే "సైబర్ జాగృక్తా దివస్" కార్యక్రమంలో భాగంగా "సురక్ష కా తీరంగా -- స్టే అలెర్ట్, స్టే అవేర్, స్టే సైబర్ సేఫ్ " ప్రత్యేక సందేశంతో మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎస్వీఎస్ మెడికల్ కళాశాలలో బుధవారం భారీ సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్, బ్యాంకు ఖాతా ఉండటంతో సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో ప్రజలను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. సాధారణ దొంగతనాల కంటే సైబర్ మోసాల వల్లే ఎక్కువ మంది నష్టపోతున్నారని పేర్కొన్నారు.గత ఏడాది దేశవ్యాప్తంగా సైబర్ మోసాల ద్వారా వేల కోట్ల రూపాయలు ప్రజలు కోల్పోయారని గుర్తు చేసిన ఆమె, విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామ ప్రజలకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా మోసాలు, నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్‌లు, స్టాక్ ట్రేడింగ్ యాప్‌లు, కొరియర్ ఫ్రాడ్‌లు, లోన్ యాప్‌లు, క్యూ ఆర్ కోడ్ మోసాలు, ఆన్‌లైన్ ఉద్యోగ మోసాలు, "డిజిటల్ అరెస్ట్" పేరుతో జరుగుతున్న మోసాలు ప్రస్తుతం ఎక్కువగా నమోదవుతున్నాయని ఆమె తెలిపారు. ఈ నెలలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

## గిరిజన పిల్లలు విద్యకు

# దూరం కాకూడదు

ప్రభుత్వం అందిస్తున్న సేవలు ఎంతవరకు చేరుతున్నాయో స్వయంగా తెలుసుకునేందుకు వివిధ గ్రామాలను సందర్శించి అనంతరం బ్రహ్మగిరి కృష్ణవేణి గెస్ట్ హౌస్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు.బ్రహ్మగిరి,విష్ణుగిరిలోని కృష్ణవేణి గెస్ట్ హౌస్‌లో గిరిజన సంక్షేమ,విద్య,వైద్య ఆరోగ్య,అటవీ,ఐటీడీఏ,పంచాయతీరాజ్,పోలీస్ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి నల్లమల్లలో చెంచు గిరిజనుల సామాజిక,ఆర్థిక పరిస్థితులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు,విద్యా,వైద్యసేవలు,మౌలిక వసతులు,అటవీ ప్రాంత విస్తీర్ణం, రవాణా సమస్యలు,తాగునీరు,విద్యుత్ సరఫరా తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని చెంచు గిరిజనుల జీవన విధానం, సంప్రదాయ జీవన నైపుణ్యాలు,ఉపాధి వనరులు, ఆదాయ మార్గాలు,ప్రభుత్వ ఆర్థిక సహాయ కార్యక్రమాలు,స్వయం ఉపాధి అవకాశాలపై అధికారులు చేపడుతున్న చర్యలను వివరించాలన్నారు.సంక్షేమ పథకాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా ప్రత్యేక కార్యాచరణ ఉండాలని ప్రభుత్వ పాఠశాలలు,ఆశ్రమ పాఠశాలలు,గిరిజన సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై సమీక్షించి విద్యార్థుల నమోదు,హాజరు శాతం,ఉపాధ్యాయ నియామకాలు, విద్యా నాణ్యత,మధ్యాహ్న భోజనం, హాస్టళ్లలో అందిస్తున్న తాగునీరు,పారిశుద్ధ్యం,విద్యార్థుల భద్రత అంశాలపై అరా తీసి విద్యార్థులు చదువును మధ్యలో మానివేయకుండా తీసుకుంటున్న చర్యలు,ఉన్నతవిద్యలో చెంచువిద్యార్థుల ప్రాతినిధ్యం,ప్రభుత్వ ప్రోత్సాహకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీక్ష అనంతరం బ్రహ్మగిరి ఉన్నత పాఠశాలను సందర్శించి తరగతి గదులను పరిశీలించి,విద్యార్థులు,ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యా పరిస్థితులను తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల,విద్యార్థుల హాజరు నమోదు, బోధనా విధానం,పాఠశాల మౌలిక వసతులను పరిశీలించి పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్యకు అనుగుణంగా విద్యార్థుల సంఖ్య ఎందుకు తక్కువగా ఉందని అధికారులను ప్రశ్నించారు. గిరిజన పిల్లలందరూ విద్యకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని,ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చేలా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.తదుపరి వట్టువర్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన అక్కడి వైద్య సేవలను పరిశీలించి వైద్యుల హాజరు,సిబ్బంది అందుబాటు,మందుల నిల్వలు,అత్యవసర సేవలు,గర్భిణులు,బాలింతలు,చిన్నారులకు అందుతున్న సేవలు,వ్యాధి నిరోధక కార్యక్రమాలు,అంబులెన్స్ సేవలు,అడవి ప్రాంతాల నుంచి రోగుల్ని తరలించే విధానంపై అధికా రులను ప్రశ్నించారు.ప్రత్యేకంగా నల్లమల్ల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న చెంచు గిరిజనులకు వైద్య సేవలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందుతు న్నాయా,సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలు,దూర ప్రాంతాల్లో మొబైల్ వైద్య సేవలు అందుతున్నాయా అని వివరాలు తెలుసుకున్నారు.ప్రతి చెంచు కుటుంబానికి నాణ్యమైన ఆరోగ్య సేవలపై చర్య తీసుకోవాలన్నారు.అనంతరం మల్లయ్య పెంట గ్రామాన్ని సందర్శించి చెంచు గిరిజన విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు,భోజనం,వసతి,సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించారు.అనంతరం చెంచు గిరిజనులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి సమస్యలను నేరుగా తెలుసుకుని గ్రామస్తులతో మాట్లాడి రోజువారీ జీవన విధానం,అడవిపైనే ఆధారపడిన జీవనం, ఉపాధి అవకాశాలు,కుటుంబ ఆదాయం,పిల్లల విద్య,ఆరోగ్యం,పోషకాహారం,తాగునీరు,విద్యుత్, గృహాలు,రహదారులు,రేషన్,పెన్షన్లు,ఉపాధి హామీ పనులు,సంక్షేమపథకాల అమలు,అడవి ఉత్పత్తుల సేకరణ తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.చెంచు మహిళలు,వృద్ధులు,యువకులుతమ సమస్యలను చైర్మన్ దృష్టికితేగా సమస్యను ఓపికగా విన్న ఆయన సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని,నల్లమల్ల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న చెంచు గిరిజనులు అభివృద్ధి ఫలాలను పూర్తిస్థాయిలో అందుకోవాలంటే ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అవసరమని విద్య, వైద్యం, పోషకాహారం,గృహ వసతి,తాగునీరు, విద్యుత్, రవాణా,జీవనోపాధి వంటి ప్రాథమిక అవసరాల విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదన్నారు.చెంచు గిరిజనుల హక్కుల పరిరక్షణతో పాటు వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు కావాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.ఈ పర్యటనలో ఇంచార్జ్ పిఓఐటీడీఏ,అచ్చంపేట ఆర్డిఓ యాదగిరి,జిల్లా గిరిజన సంక్షేమాధికారి కోటయ్య,వైద్య శాఖ అధికారి డాక్టర్. కృష్ణ,జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్, డిఎస్పి శ్రీనివాసులు,విద్యా,వైద్య,అటవీ శాఖల అధికారులు

# పెద్ద చింతరేవులలో ఈనెల 8 నుంచి 48వ,చాతుర్మాస్య మహోత్సవాలు

### ఉడిపి పాలిమారు మఠం పీఠాధిపతుల ప్రవచనాలు
### భక్తులకు నిత్య అన్నప్రసాదం,ప్రత్యేక పూజలు





**దరూర్,ఆగస్టు 5(ప్రజా జ్యోతి ప్రతినిధి):**
జోగులాంబ గద్వాల జిల్లా దరూర్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో 48వ, చాతుర్మాస్య మహోత్సవాలు ఈ నెల 8వ,తేదీ నుంచి సెప్టెంబర్ 25వ,తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు.18వ,శతాబ్దంలో వెలసిన ఈ క్షేత్రంలో ఉడిపి పాలిమారు మఠం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 1008 శ్రీ విద్యాధీశ తీర్థ శ్రీపాదులు,శ్రీశ్రీశ్రీ 1008 శ్రీ విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదుల వారి ఆధ్వర్యంలో ఆషాఢ బహుళ దశమి (ఆగస్టు 8) నుంచి భాద్రపద శుద్ధ పౌర్ణమి (సెప్టెంబర్ 25) వరకు చాతుర్మాస్య మహోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు శ్రీమన్న్యాయసుధా పాఠం,సంస్థాన పూజలు,ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు సమగ్ర శ్రీరామాయణం,శ్రీమద్భాగవత ప్రవచనాలు పీఠాధిపతులచే నిర్వహించబడతాయని వెల్లడించారు.అదేవిధంగా భక్తుల అభీష్టానుసారం సంపూర్ణ సేవ,సంస్థాన పూజ,పవమాన హోమం,నవగ్రహ హోమం,పాదపూజ,తులాభార పూజ, తొట్టెల పూజ,ప్రత్యేక అర్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.పూజా సామగ్రి కోసం నిర్ణీత రుసుము చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.శ్రీ పెద్ద చింతరేవుల అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ భక్తులకు ఉదయం అల్పాహారం,టీ,కాఫీ,మధ్యాహ్నం అన్నప్రసాదం,సాయంత్రం టీ,కాఫీ,రాత్రి అల్పాహారం లేదా అన్నప్రసాదం ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు.ఈ ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు.అలాగే ప్రతిరోజూ శ్రీ ఆంజనేయస్వామివారికి అభిషేకాలు,ఆకు పూజలు,అర్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# చిన్నారుల హక్కుల పరిరక్షణకు చట్టాలపై అవగాహన అవసరం


**కేటీదొడ్డి,ఆగస్టు 5(ప్రజా జ్యోతి)**
:చిన్నారుల సంక్షేమం,రక్షణకు సంబంధించి జాతీయ న్యాయ సేవా సంస్థ (నల్సా) అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవా సంస్థ,జోగులాంబ గద్వాల ఆధ్వర్యంలో బుధవారం కేటీదొడ్డి మండలంలోని ఎం.జే.పి.టి.బి.సి.డబ్ల్యూ.ఆర్.ఈ.ఐ.ఎస్.(బాలుర) విద్యాలయంలో ప్రత్యేక న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ వి.రాజేందర్ ముఖ్య వక్తగా పాల్గొని,చిన్నారులకు చట్టం కల్పించిన హక్కులు,నల్సా ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయం,పోక్సో చట్టం--2012,బాల్య వివాహాల నిషేధ చట్టం--2006,బాల కార్మిక (నిషేధం,నియంత్రణ) చట్టం,విద్యా హక్కు చట్టం--2009,జువెనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ, రక్షణ) చట్టం--2015,సైబర్ భద్రతతో పాటు చిన్నారుల రక్షణకు సంబంధించిన వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,చిన్నారులు ఎలాంటి వేధింపులు,దుర్వినియోగం లేదా హింసకు గురైన వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలను వినియోగించాలని,ఉచిత న్యాయ సహాయం అవసరమైన వారు నల్సా టోల్‌ఫ్రీ నంబర్ 15100 ద్వారా న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు.ప్రతి చిన్నారికి సురక్షిత వాతావరణంలో జీవించే



హక్కు,విద్యను అభ్యసించే హక్కు,హింస,దుర్వినియోగం నుంచి రక్షణ పొందే హక్కును భారత రాజ్యాంగం,వివిధ బాలల సంక్షేమ చట్టాలు కల్పించాయని వివరించారు.విద్యార్థులు సోషల్ మీడియా,ఇంటర్నెట్‌ను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సునంద,జిల్లా బాలల పరిరక్షణ అధికారి నరసింహ,పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు,చైల్డ్‌లైన్ ప్రతినిధులు సురేష్, జయన్న,ఎం.వి.ఫౌండేషన్ ప్రతినిధి హనిమిరెడ్డి,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీశైలం జలాశయానికి భారీ వరద

### -ప్రస్తుత నీటిమట్టం 863.9 అడుగులు



నాగర్ కర్నూల్ : ఆగస్టు 05 (ప్రజా జ్యోతి)
కృష్ణానది పరివాహక ప్రాంతంలో వరద ఉధృతి కొనసాగుతుండడంతో భీమా నదిపై ఉన్న ఉజ్జయిని జలాశయం నుంచి జూరాల జాలాషయానికి 1,20,000 ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో వస్తుండగా అలమట్టి నుంచి 1.5 లక్షల క్యూసెక్కులు,నారా యణ్ పూర్ నుంచి 1,45,400 క్యూసెక్కుల చొప్పున వరద దిగువకు వస్తుంది.జూరాల నుంచి2,51,836 క్యూసెక్కుల భారీ వరదను శ్రీ శైలం జలాశానికి విడుదల చేస్తున్నారు. ఐతే శ్రీ శైలంజాలాషయం ద్వారా ఔట్ ఫ్లో ఇంకా ప్రారంభం కాలేదు.కృష్ణానది పరివాహక ప్రాంతం నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం పెరుగుతుందని బుధవారం ఉదయం 6:00గంటలకు2,39,891 క్యూసెక్కుల నీరు చేరుతుందని ప్రస్తుతం నీటిమట్టం 8863.9 అడుగులు చేరగా 118.62 టీఎంసీలు నీరు నిల్వ ఉందని వరద ఇదే విధంగా కొనసాగితే జలాశయం గేట్లు ఎత్తే అవకాశం ఉందని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.




# నాగర్ కర్నూల్ జిల్లాలో స్వల్ప వర్షపాతం నమోదు

**నాగర్ కర్నూల్ : ఆగస్టు 5 (ప్రజా జ్యోతి)**
టి.జి.డి.పి.ఎస్ ఆటోమేటిక్ వాతావరణ స్టేషన్ల నివేదిక ప్రకారం ఆగస్టు 4వ,తేది ఉదయం 8:30 నుంచి ఆగస్టు 5వ,తేది ఉదయం 8:30 వరకు నాగర్ కర్నూల్ జిల్లాలో స్వల్ప వర్షపాతం నమోదయిందని,అత్యధికంగా నాగర్ కర్నూల్ మంలంతూడుకుర్తి లో 7.0 మిమి, తాడూరు మండలంయంగంపల్లిలో 2.3 మిల్లీమీటర్లు,వంగూరు మండలం కిష్టంపల్లిలో 2.0 మిమి వర్ష పాతం నమోదు కాగా మిగతా ప్రాంతాల్లో వర్షపాతం నమోదు కాలేదని అధికారులు తెలిపారు.



# ఎస్.టి.యు.టెట్ మెటీరియల్ ఉపాధ్యాయులకు ఉపయోగకరం

### -జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్



**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 05 (ప్రజా జ్యోతి)**
నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన టెట్ మెటీరియల్ ను జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ టెట్ పాస్ కానీ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుందని మెటీరియల్ ను రూపొందించిన నాయకులను అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రతకు,సమస్యల పరిష్కానికి 80 సంవత్సరాలుగా నిరంతరం కృషి చేస్తుందని అన్నారు.జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో విలువైన టెట్ మెటీరియల్ అతి తక్కువ ధరకు ఒక్కో పేపర్ కు 6 పుస్తకాలు అందిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు అనిల్ కుమార్ రెడ్డి,ప్రభాకర్ మండల శాఖ అధ్యక్షులు బాలస్వామి,తాడుర్ మండల శాఖ అధ్యక్షులు సురేష్ బాబు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి రూ.8 వేల ఆర్థిక సాయం



**చిన్నంబావి, ఆగస్టు 5 (ప్రజా జ్యోతి)**
చిన్నంబావి మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామానికి చెందిన జల్లి సహదేవుడు (44) అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు. సహదేవుడి మృతి విషయాన్ని గ్రామ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సింగిల్ విండో వైస్ ప్రెసిడెంట్ బిళ్లకంటి విద్యాసాగర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన విద్యాసాగర్‌రావు మృతుడి కుటుంబానికి రూ.8,000 ఆర్థిక సహాయం అందించారు.అదేవిధంగా గ్రామానికి చెందిన ఎద్దుల బాలమ్మ (78) మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను కూడా సర్పంచ్, ఉప సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ నరేష్ యాదవ్, కే. లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమంతరావు, వార్డు సభ్యులు పురేందర్ నాయుడు, మాజీ వార్డు సభ్యులు గడ్డం నరహరి, గడ్డం నరసింహ, దాసరి వెంకటస్వామి, ప్రజాజ్యోతి రిపోర్టర్ ఎస్. శ్రీనివాసులు, కొల్లాపూర్ తాలూకా వాల్మీకి సంఘం అధ్యక్షుడు పసుల రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్ కల్వకోల్ ఉసేన్నయ్య, కృపేందర్ నాయుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# చిన్నమారు లిఫ్ట్ ఇరిగేషన్ ఫేస్ 1 పంప్ హౌస్ నీటి విడుదల

## కృష్ణమ్మ జలాలతో రైతుల్లో హర్షం.. మంత్రి జూపల్లి ఆదేశాలతో నీటి విడుదల







**చిన్నంబావి, ఆగస్టు 5 (ప్రజా జ్యోతి)**

చిన్నంబావి మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామ సమీపంలో ఉన్న కృష్ణానదిపై నిర్మించిన చిన్నమారూర్ ఎత్తిపోతల పథకం ఫేజ్--1 పంప్‌హౌస్ మోటార్లను బుధవారం రన్ చేశారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణానదికి సమృద్ధిగా నీరు వస్తుండటంతో సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మోటార్ల ద్వారా నీటిని లిఫ్ట్ చేసి కాలువలోకి విడుదల చేశారు.గ్రామ సర్పంచ్,ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ప్యానల్ బోర్డుపై స్విచ్‌లు ఆన్ చేసి మోటార్లను ప్రారంభించారు. దీంతో కృష్ణానది నీరు కాలువల ద్వారా ఆయకట్టు భూములకు చేరుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. నెదర్లాండ్స్ ప్రభుత్వ ఆర్థిక సహకారంతో అప్పటి కొల్లాపూర్ ఎమ్మెల్యే కొత్త వెంకటేశ్వరావు హయాంలో నిర్మించిన చిన్నమారూర్ ఎత్తిపోతల పథకం ప్రారంభంలో సక్రమంగా పనిచేసింది. అనంతరం నిర్వహణ, నియంత్రణ, పర్యవేక్షణ లోపాలతో మోటార్లు నిరుపయోగంగా మారాయి. తాజాగా మోటార్లను తిరిగి రన్ చేయడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం నెలకొంది.మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫేజ్--1 పంప్‌హౌస్ ద్వారా నీటిని విడుదల చేసినట్లు గ్రామ పంచాయతీ పాలకవర్గం తెలిపింది. నీటిని వృథా చేయకుండా కాలువల ద్వారా చెరువుల్లోకి మళ్లించేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందుబాటులోకి రావడంతో పరిధిలోని వ్యవసాయ భూములకు నీటి సమస్య కొంతమేర పరిష్కారమవుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. పథకాన్ని తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్ నరేష్ యాదవ్, హనుమంతరావు, కే.లక్ష్మయ్య, కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, రైతులు, ఆబోతు చంద్రయ్య, మూగి కురుమయ్య, లోకేష్,మద్దిలేటి, నాగరాజు, గ్రామస్థులు, లిఫ్ట్ ఆపరేటర్లు, పాల్గొన్నారు.

# పాఠశాలల్లో ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేయాలి: ఎంఈవో జి.సురేష్




**మల్దకల్,ఆగస్టు 5(ప్రజా జ్యోతి):**

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు.సమావేశానికి మండల విద్యాధికారి (ఎంఈఓ) జి.సురేష్ అధ్యక్షత వహించారు.జిల్లా కలెక్టర్ సమీక్షలో ప్రాధాన్యం పొందిన అంశాలపై ప్రధానోపాధ్యాయులకు ఆయన సమగ్ర మార్గదర్శకాలు అందించారు.ఈ సందర్భంగా విద్యార్థుల నమోదు (ఎన్‌రోల్‌మెంట్) పెంపు,సిబ్బంది,విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ హాజరు, బేస్‌లైన్,ఎఫ్ఏ--1 ఫలితాల విశ్లేషణ, డ్రాప్‌బాక్స్ నిర్వహణ,ఆధార్ నమోదు,నవీకరణ,అపార్ ఐడీల నమోదు,యూ–డైస్ సమాచార నవీకరణ,కిచెన్ గార్డెన్ నిర్వహణ,గ్యాస్ కనెక్షన్ వినియోగం,మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం)యాప్‌లో మెనూ నమోదు,బిల్లుల సమర్పణ,ప్రీ–మెట్రిక్ స్కాలర్‌షిప్ నమోదు తదితర విద్యాశాఖ కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఎంఈఓ జి.సురేష్ మాట్లాడుతూ,ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని కార్యక్రమాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.విద్యార్థుల నమోదు,హాజరు,విద్యా ప్రమాణాల పెంపుతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు.ప్రతి పాఠశాల ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను విజయవంతంగా సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# "పిల్లల భవిష్యత్తా... ఫీజుల వ్యాపారమా?"

**- ఫీజులు కట్టలేదని పరీక్షలకు అడ్డుకట్ట... ప్రశాంతి నికేతన్ హైస్కూల్ యాజమాన్యంపై తీవ్ర విమర్శలు**

**- "పిల్లాడి చదువుతో పంతం పెట్టడం... బంగారు గుడ్డు పెట్టే కోడిని కోయడమే" అంటూ మండిపడుతున్న తల్లిదండ్రులు**

**మహబూబ్‌నగర్ ఆగస్టు 5 ( ప్రజాజ్యోతి బ్యూరో ):**

"విద్య దానం మహాదానం" అని పెద్దలు చెబితే... "ఫీజు కడితేనే విద్య" అన్నట్టుగా ప్రవర్తిస్తోందనే విమర్శలు మహబూబ్‌నగర్ పట్టణంలోని బీకే రెడ్డి కాలనీలో ఉన్న ప్రశాంతి నికేతన్ హైస్కూల్ యాజమాన్యంపై వెల్లువెత్తుతున్నాయి. ఫీజులు బకాయి ఉన్నాయనే కారణంతో ఏకంగా 40 మంది విద్యార్థులను ఫార్మేటివ్ అసెస్‌మెంట్--ఎఫ్ ఏ -1 పరీక్షలు రాయకుండా అడ్డుకోవడం తీవ్ర వివాదానికి దారి తీసింది."పాపం పిల్లలది... పంతం పెద్దలది" అన్న సామెతను తలపించేలా, యాజమాన్యం తన వసూళ్ల యుద్ధంలో అమాయక విద్యార్థులను బలిపశువులుగా మార్చిందంటూ తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల నుంచి పిల్లలను దూరం చేయడంతో అవమానానికి గురైన విద్యార్థులు మానసికంగా కుంగిపోయారని, వారి భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని ఆరోపిస్తున్నారు. "కాసుల కక్కుర్తి కోసం విద్యను కోత కోయొద్దు" అనే మాటను కూడా మరిచిపోయినట్టుగా సదరు పాఠశాల యాజమాన్యం వ్యవహరిస్తోందని పలువురు విమర్శిస్తున్నారు.పట్టణానికి చెందిన యం.డి ఖాజా మొయినోద్దీన్ తన ఇద్దరు పిల్లలను కూడా పరీక్షలు రాయనివ్వకుండా బహిరంగంగా అవమానించారని ఆరోపిస్తూ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సి డబ్ల్యూ సీ )కి లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. పాఠశాల సిబ్బంది తమ పిల్లలను కక్షపూరితంగా వ్యవహరిస్తూ, చిన్నారులను లక్ష్యంగా చేసుకుని మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని ఆయన



పేర్కొన్నారు.ఫిర్యాదు అందుకున్న చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మహ్మద్ నయిమొద్దీన్ విచారణ చేపట్టి, పిల్లల హక్కులను ఉల్లంఘించే చర్యలు కొనసాగితే చట్టపరమైన చర్యలు తప్పవని 8పాఠశాల యాజమాన్యాన్ని హెచ్చరించారు. తల్లిదండ్రులు 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ ను ఆశ్రయించడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనంగా మారింది.ఇదిలా ఉండగా, గత విద్యా సంవత్సరంలో 9వ తరగతి నడుపుటకు అవసరమైన ప్రభుత్వ అనుమతులు లేకపోయినా యదేచ్ఛగా తరగతులు నిర్వహించారనే ఆరోపణలు మరోసారి తెరపైకి వచ్చాయి. అయినప్పటికీ సంబంధిత విద్యాశాఖ అధికారులు ఇప్పటివరకు కఠిన చర్యలు తీసుకోకపోవడంపై పలు వర్గాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

"దొంగకు తాళాలు అప్పగించినట్టుగా" జిల్లా విద్యా శాఖ వ్యవస్థ పర్యవేక్షణ ఎవ్వవస్థ మారిందా? లేక "చూసీ చూడనట్టు" వ్యవహరిస్తున్నారా.? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి, ఫీజుల కోసం విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టడం ఎంతవరకు సమంజసమని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. "చెట్టును కాపాడాలంటే వేరును కాపాడాలి... సమాజాన్ని కాపాడాలంటే పిల్లల విద్యను కాపాడాలి" అనే విషయాన్ని సంబంధిత జిల్లా ఉన్నత అధికారులు గుర్తించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# నేటి టి డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయండి

**- టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ షఫీ**

**- ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ కృష్ణ**



**నాగర్ కర్నూల్ ఆగస్ట్ 5 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు లో ఆగస్ట్ 6 న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా విస్తృత స్థాయి సమీక్ష సమావేశం ఏర్పాటు చేసినట్టు జిల్లా కార్యదర్శి వెంకట్ స్వామి జిల్లా ఉపాధ్యక్షుడు, మరియు అచ్చంపేట ఇంచార్జ్ సయ్యద్ షఫీ బుధవారము ఒక ప్రకటనలో తెలిపారు.అదేవిధంగా అచ్చంపేట తాలూకా ఫారెస్ట్ గెస్టుహౌస్ నందు గల మన్ననూర్ సీబీటీ సెంటర్లో నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు.జిల్లాకు సంబంధించిన నాయకులు అందరికీ ఉదయం 10 గంటల వరకు కార్యక్రమ ప్రాంగణం వద్ద కు చేరుకోవాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన సందర్భంగా ఆయనమాట్లాడుతూ జిల్లా విస్తృత స్థాయి సమావేశాలు మరియు అచ్చంపేట తాలూకా నూతన కమిటీ సమావేశం వియయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశానికి జిల్లా నలుమూలల లో పనిచేస్తున్న జర్నలిస్ట్ లు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ హౌదేకర్ నవీన్ కోరారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టి డబ్ల్యూ జే ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ హాజరవుతున్నట్లు తెలిపారు.

# చిన్నంబావిని చూస్తే.. పోయిన ప్రాణం లేచొచ్చినంత ఆనందం!

**చిన్నంబావి,ఆగస్ట్ 8 (ప్రజా జ్యోతి)**

చిన్నంబావి తాను కొప్పునూరు ఎస్సీ బాలుర హాస్టల్లో వసతి గృహ సంక్షేమ అధికారిగా పనిచేసినప్పుడు అక్కడ వర్కర్ గా అంకితభావంతో పనిచేసిన ఏకైక కుమారుడి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం సాయంత్రం కొప్పునూరులో నరేష్ స్వగృహంలో జరిగిన అతని కుమారుడి పుట్టినరోజు వేడుకకు హాజరై బుధవారం ఉదయం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో జరిగే పెన్షనర్స్ తో చర్చించడానికి వెళ్తూ – చిన్నంబావి మండల కేంద్రంలో అనుకోకుండా కలసిన తన ఆప్త మిత్రుడు "ప్రజా జ్యోతి"విలేకరి శ్రీనివాస్ తో తన మనసులోని బావాలు పంచుకున్నారు. తాను ఇక్కడికి వచ్చిన విషయం అతడితో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – ఈ ప్రాంతం చూస్తుంటే, పోయిన ప్రాణం లేచి వచ్చినంత ఆనందం కలుగుతుంది. ఈ ప్రాంత విద్యార్థులు,ప్రజలు నాపై చేయించిన ప్రేమ అలాంటిది అన్నారు. ఇప్పుడు మహబూబ్ నగర్ వెళ్ళి పెన్షనర్స్ శుక్రవారం హైద్రాబాద్ లో జరిగే మహా ధర్నా సక్సెస్ గురించి ఆలోచించే సమావేశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే, ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం అనే పేరు అనాదిగా ఉంది. ఉద్యోగుల, పెన్షనర్స్ కోరుతున్న న్యాయమైన డిమాండ్స్ నెరవేర్చి ఆ మాట నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. ఈ చిన్న కోరిక నెరవేరుస్తారనే నమ్మకం తమకుంది అన్నారు. త్వరలోనే విజయసకల్పంతో తమ ముందుకు వస్తామన్నారు.





# ఆటలు, కథలతోనే చిన్నారుల అభ్యసనకు బలమైన పునాది

## - ప్రీ-ప్రైమరీ బోధనలో ప్లే-బేస్డ్, ఆక్టివిటీ-బేస్డ్ లెర్నింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి: డీఈఓ విజయకుమారి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 5 (ప్రజా జ్యోతి బ్యూరో):**

చిన్నారుల ప్రారంభ విద్యను నాణ్యవంతంగా తీర్చిదిద్దాలంటే ఆటలు, కథలు, పాటలు, అనుభవాత్మక కార్యకలాపాల ఆధారంగా బోధన సాగించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ విజయకుమారి అన్నారు. పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసే లక్ష్యంతో జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో నిర్వహిస్తున్న "ఏ కెపాసిటి బిల్డింగ్ ఇనిషియేటివ్ ఫర్ క్వాలిటీ ఎర్లీ చైల్డ్హుడ్ ఎడ్యుకేషన్ ఫర్ ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ " శిక్షణ కార్యక్రమాన్ని ఆమె బుధవారం సందర్శించి శిక్షణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణార్థులతో నేరుగా మాట్లాడిన డీఈఓ, శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో ఎలా అమలు చేయాలనే విషయంపై చర్చించారు. ప్రీ-ప్రైమరీ విద్యార్థుల వయస్సు, మానసిక స్థితి, ఆసక్తులు, అభ్యసన సామర్థ్యాలకు అనుగుణంగా తరగతి గది బోధన ఉండాలని సూచించారు.ప్రభుత్వం ప్రీ-ప్రైమరీ పాఠశాలలను ఎందుకు ప్రవేశపెట్టిందో, ప్రారంభ బాల్య విద్య ప్రాధాన్యత ఏమిటో, ప్లే-బేస్డ్ లెర్నింగ్, ఆక్టివిటీ-బేస్డ్ లెర్నింగ్ వంటి విధానాలను తరగతి గదిలో ఎలా అమలు చేయాలో శిక్షణార్థులను ప్రశ్నించి వారి అవగాహనను పరిశీలించారు. శిక్షణార్థులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, అవగాహన పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రీ-ప్రైమరీ దశ పిల్లల భవిష్యత్ విద్యాభ్యాసానికి పునాది అని పేర్కొన్న డాక్టర్ విజయకుమారి, ఈ వయస్సులో ఒత్తిడి లేకుండా ఆటలు, పాటలు, కథలు, సంభాషణలు, చిత్రాలు, అనుభవాత్మక కార్యకలాపాల ద్వారా నేర్చుకునే అవకాశాలను కల్పించాలని సూచించారు. పిల్లలు ఆనందంగా, స్వేచ్ఛగా పాల్గొనేలా తరగతి గది వాతావరణాన్ని రూపొందించాలని అన్నారు.

ప్లే-బేస్డ్, ఆక్టివిటీ-బేస్డ్ బోధన ద్వారా పిల్లల్లో భాషా నైపుణ్యాలు, సామాజిక



విలువలు, సృజనాత్మకత, ఆలోచనా శక్తి, సమస్య పరిష్కార సామర్థ్యం, సంఖ్యా అవగాహన వంటి ప్రాథమిక నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. పిల్లలు చూసి, విని, మాట్లాడుతూ, ఆడుతూ, అనుభవిస్తూ నేర్చుకునేలా బోధనా ప్రక్రియ కొనసాగాలని సూచించారు.

శిక్షణలో పొందిన జ్ఞానం, నైపుణ్యాలను పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేసి ప్రతి చిన్నారికి నాణ్యమైన ప్రారంభ బాల్య విద్యను అందించాలని ఆమె శిక్షణార్థులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రీ-ప్రైమరీ పాఠశాలలను మరింత ఆకర్షణీయంగా, పిల్లలకు ఆనందదాయకంగా తీర్చిదిద్దడంలో ప్రతి బోధకుడి పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమంలో మొత్తం 113 మంది శిక్షణార్థులు పాల్గొంటున్నారు. వారికి బోధనా పద్ధతులు, తరగతి గది నిర్వహణ, పిల్లలతో పరస్పర చర్యలు, ఆటలు--కథల ఆధారిత అభ్యసన విధానాలపై శిక్షణ అందిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి దుంకుడు శ్రీనివాస్, డైట్ ప్రధానాచార్యులు మెరాజుల్లా ఖాన్, డీఆర్‌పీలు ప్రకాశ్, శ్రీవాణి, జగదీశ్వర్ రెడ్డి, నోమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నవోదయ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

## నవోదయ ఫౌండేషన్ డే వేడుకల్లో పాల్గొన్న జిల్లా ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 5 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు విలువలతో కూడిన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో జవహర్ నవోదయ విద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని జిల్లా ఎస్పీ దరావత్ జానకి అన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని బండమీదిపల్లిలో గల జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం నిర్వహించిన నవోదయ ఫౌండేషన్ డే వేడుకలకు జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నవోదయ విద్యాలయాలు గ్రామీణ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి దేశానికి ఉత్తమ పౌరులను అందిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత వంటి విలువలను అలవరచుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు.కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించిన ఎస్పీ, లక్ష్య సాధనకు నిరంతర శ్రమే విజయానికి మార్గమని విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. అనంతరం జిల్లా ఎస్పీ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారి





విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, ఆశయాల గురించి తెలుసుకుని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ భాస్కరాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సంపంగి మద్దిలేటి 48వ జన్మదిన వేడుకలు

చిన్నంబావి, ఆగస్టు 5 (ప్రజా జ్యోతి)

చిన్నంబావి మండల పరిధిలోని లక్ష్మిపల్లి గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సంపంగి మద్దిలేటి 48వ జన్మదిన వేడుకలు చిన్నంబావి మండల చౌరస్తాలో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు దేవుని రమేష్ మాదిగ, వడ్డేమాన్ రామకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ తగరం కుర్మయ్య, తగరం ఆటో కుర్మయ్య, తగరం కాన్షిరం, సంకటి మద్దిలేటి, బాల వెంకట్, వై స్వామి, చిన్న మద్దిలేటి, కాకునూరు కృష్ణ, మేస్త్రి వెంకటస్వామి, డ్రైవర్ వెంకట్, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సంపంగి మద్దిలేటి మంద కృష్ణ మాదిగ అడుగుజాడల్లో నడుస్తూ మాదిగ దండోరా సంఘానికి సేవ చేస్తూ సమాజ సేవలో అందిస్తున్న సేవలను నాయకులు కొనియాడుతూ, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమం సందర్భంగా హర్షాతిరేకాల మధ్య జన్మదిన వేడుకలు సందడిగా జరిగాయి.ఈ వేడుకల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమానులు మరియు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొని సంపంగి మద్దిలేటి 48వ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.



## తెలంగాణ కర్ణాటక సరిహద్దుల్లో

# ఘోరవిషాదం

### -విషవాయువు లీకేజ్ ముగ్గురు కార్మికులు మృతి

### -తీవ్ర అస్వస్థతకు గురైన మరో ఇద్దరు కార్మికులు



కృష్ణ మండల సరిహద్దులోని కడెచూరు-బాడియాల్ పారిశ్రామిక ప్రాంతంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. స్థానిక 'సిఐఎల్ లాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్' కెమికల్ కంపెనీలో హఠాత్తుగా విషవాయువు లీక్ కావడంతో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. ఫ్యాక్టరీలో పనులు జరుగుతుండగా ప్రమాదవశాత్తు విషవాయువు లీక్ అయింది. ఈ ఘటనలో బీహార్‌కు చెందిన విక్రమ్ సింగ్ (36), నిరంజన్ సింగ్ (30), తెలంగాణలోని అలంపల్లి గ్రామం, కృష్ణ మండలానికి చెందిన గణేష్(20) ఊపిరాడక సంఘటనా స్థలంలోనే ముగ్గురు మృతి చెందారు. ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం జిల్లాకు చెందిన హేమంత్, శివకుమార్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వారిని వెంటనే కర్ణాటకలోని రాయచూరు జిల్లా 'రిమ్స్' ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి అత్యవసర చికిత్స అందిస్తున్నారు.సరిహద్దుల్లో అనుమతులు లేకుండా, కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా కెమికల్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయడం వల్ల నిత్యం వెలువడే విషవాయువులతో ఊపిరితిత్తుల వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని సరిహద్దు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అంతేకాకుండా రసాయనాల ప్రభావంతో పంట పొలాలు కూడా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం బాధ్యతారాహిత్యం, భద్రతా నిర్లక్ష్యమే ఈ ఘోర ప్రమాదానికి కారణమని వారు ఆరోపించారు.

ఈ ప్రమాదంపై సైదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. అయితే, కేవలం కేసులతో సరిపెట్టకుండా ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన కంపెనీ యాజమాన్యం పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు భారీ మొత్తంలో నష్టపరిహారం చెల్లించాలని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన కార్పొరేట్ వైద్యం అందించాలని సైదాపూర్, కృష్ణ మండలాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# పాలకు కనీస మద్దతు ధర ప్రకటించాలి

## విజయ డైరీ చైర్మన్‌ను కలిసి వినతి పత్రం అందజేసిన మార్చాల పాడి రైతులు

**కల్వకుర్తి, ఆగస్టు 5 ( ప్రజా జ్యోతి ):**

పాడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే పాలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని మార్చాల గ్రామ పాడి రైతులు డిమాండ్ చేశారు.

బుధవారం మార్చాల గ్రామ సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి, విజయ డైరీ శ్రీశైలం,ఆధ్వర్యంలో గ్రామ పాడి రైతులు హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర విజయ డైరీ చైర్మన్ గుత్తాఅమిత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కనీస మద్దతు ధర లేకపోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే మద్దతు ధర ప్రకటించి పాడి రైతులను ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా రైతులకు సకాలంలో పాల బిల్లులను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో విజయ డైరీ వైస్ చైర్మన్ రామచంద్రయ్య గౌడ్, దేశం వెంకట్రెడ్డి, సుల్తాన్, రాములు, బర్రె మల్లయ్య, మాచర్ల శ్రీనివాసులు, డొక్క లక్ష్మయ్య, గొడుగు చంద్రశేఖర్, కసిరెడ్డి రామిరెడ్డి, ఆవ ఐలెన్ కంకల వెంకటయ్య, కంకల జంగమయ్య, తిరుపతయ్య, శేఖర్ రెడ్డి, గొడుగు శివ, మేకల శ్రీను, డి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు విజయవంతం

### -పుట్టిన బిడ్డకు తల్లిపాలు తొలి వ్యాక్షన్
### -మక్తల్ సెక్టార్ సూపర్వైజర్ మమత



**మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఆగస్టు 05 (ప్రజా జ్యోతి):** మక్తల్ మండలంలోని దాసర్ దొడ్డి గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు విజయవంతంగా జరిగాయి. వారోత్సవాలకు స్థానిక అంగన్వాడీ టీచర్ బసవ లింగమ్మ,అధ్యక్షత వహించారు. వారోత్సవాలకు ముఖ్య అతిథులు గ్రామ సర్పంచ్ బాలమణి మక్తల్ సెక్టార్ సూపర్వైజర్ మమత,మెడికల్ అధికారి డాక్టర్ సి హెచ్ జమ్ రాజ్, డాక్టర్ శిరీష ,ఎంపీడీవో రమేష్, గ్రామపంచాయతీ కార్యదర్శి అరవింద్, యుపిఎస్ ఉపాధ్యాయులు గురురాజ్ పాల్గొన్నారు.

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో ప్రాముఖ్యత గురించి మాట్లాడుతూ ప్రధానంగా గర్భిణి గర్భం దాల్చిన నాటి నుండి గర్భిణులు తీసుకోవాల్సిన ఆహార పదార్థాల గురించి వివరించారు. ఆకుకూరలు , పప్పు దినుసులు, పండ్లు, పాలు, గుడ్డు తీసుకుంటే శరీరం ఆరోగ్యంగా ఉంటుంది,అట్లాగే హీమోగ్లోబిన్ పెరుగుతుంది.. ఉదాహరణకు మహిళలు అనేక సమస్యలతో సతమతమవుతూ రక్తహీనత తో బాధపడుతున్నారు. కొందరు గర్భిణీ, బాలింతలలో రక్తం ఆరు నుంచి 8 పాయింట్లు మాత్రమే ఉంటున్నది.గర్భిణీ స్త్రీలలో రక్తం 14 నుంచి 15 పాయింట్లు ఉండాలి. తల్లి ఆరోగ్యంగా ఉంటే పిల్లలు ఆరోగ్యం గా ఉంటారు. పిల్లలు ఆరోగ్యం గా ఉంటే సమాజం ఆరోగ్యం గా ఉంటుంది అని తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని ఎంపీడీవో రమేష్ మాట్లాడుతూ ప్రధానంగా గర్భిణులు బలవర్ధకమైన ఆహార తీసుకున్నప్పుడే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతమై, తల్లిపాలు ధారాళంగా పుష్కలంగా అందుతాయని రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఆయన తెలియజేశారు. డాక్టర్ సిహెచ్ జమ్ రాజ్ మాట్లాడుతూ తల్లిపాలు ఆరోగ్యవంతమైన శ్రేష్టమైన పాలు బిడ్డను జన్మనిచ్చినప్పుడు వెంటనే ముర్రుపాలు పట్టించాలని, ఉదాహరణ ఆవులు జన్మించినప్పుడు వెంటనే పాలు పిసికి జున్నుపాలు అంటే అనేక పోషకాలతో కూడిన పాలు వెంటనే గడ్డలు కట్టి జున్నుగా మారినటువంటి పాలు మనము ఆ జున్ను ని తింటున్నమో అది బలవర్ధకమైన ఆహారపదార్థము అనేక ప్రోటీన్లతో జున్ను పాలు తింటున్నమో అదేవిధంగా తల్లులు బిడ్డకు జన్మనివ్వగానే వచ్చే పసుపు రంగు లో ఉండే పాలు దానినే ముర్రుపాలు అంటారు ఆ ముర్రుపాలు పుట్టగానే బిడ్డకు తాగిస్తే పిల్లలకు ఇమ్యూనిటి పెరుగుతుంది అన్నారు. గర్భిణులు బాలింతలు తప్పకుండా పౌష్టికారమైన ఆహార పదార్థాలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ ఎ హెల్పర్స్ మరియు గర్భిణీలు,బాలింతలు, గ్రామ పెద్దలు,అంగన్వాడీ టీచర్స్ బసవలింగమ్మ,సువర్ణ,హెల్పర్స్ కవిత లక్ష్మి,మక్తల్ 11 వ సెంటర్ మంజుల, విజయలక్ష్మి,చందాపూర్ అంగన్వాడి టీచర్ విజయమ్మ, తిరుమలాపూర్ అంగన్వాడీ టీచర్ నాగేంద్రమ్మ,హెల్పర్స్ కవిత లక్ష్మి, నర్మద గర్భిణులు, బాలింతలు,బాలింతలు, గ్రామ పెద్దలు కాశమోల ఓబయ్య,సి ఆర్ గోవింద్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ఎఫెక్ట్..! వరిపై ఆశలు వద్దు

### - వేరుశెనగ, మినుములు, ఆయిల్‌పామ్ సాగు పెంచాలి
### - ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి: జిల్లా ప్రత్యేక అధికారి వి.పి. గౌతమ్ ఆదేశాలు



**వనపర్తి, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):** ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నందున రైతులను వరి సాగుపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్, జిల్లా ప్రత్యేక అధికారి వి.పి. గౌతమ్ అధికారులను ఆదేశించారు. ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారికి పంటల మార్పిడి లక్ష్యాలు నిర్దేశించి క్షేత్రస్థాయిలో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఇదే సమయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, రూఫ్ రీప్లేస్‌మెంట్ పనులను కూడా వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎల్‌నినో పరిస్థితులు, పంటల మార్పిడి, ఇందిరమ్మ ఇళ్లు, మిషన్ భగీరథ తదితర అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలో సాధారణంతో పోలిస్తే 18 శాతం వర్షపాతం లోటు నమోదైందని అధికారులు వివరించారు. జూరాల ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ, ఒకసారి నీటి నింపుదలతో ఉమ్మడి జిల్లా పరిధిలోని 5 లక్షల ఎకరాల ఆయకట్టులో కేవలం 50 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందే పరిస్థితి ఉందని నీటిపారుదల అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో కొద్దిరోజుల వర్షాన్ని చూసి రైతులు వరి సాగుకు మొగ్గు చూపకుండా వాస్తవ పరిస్థితులను వివరించి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలని గౌతమ్ సూచించారు. జిల్లాలో వేరుశెనగ సాగును 40 వేల ఎకరాలకు, మినుముల సాగును 30 వేల ఎకరాలకు పెంచేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. కందులు, ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగును కూడా ప్రోత్సహించాలని చెప్పారు. ఉద్యానవన శాఖ ద్వారా ఏడాదికి 6 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్, 7 వేల ఎకరాల్లో కూరగాయల సాగు లక్ష్యంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో గుడిసెల్లో నివసించే అర్హులందరికీ ఇళ్ల మంజూరు, రూఫ్ రీప్లేస్‌మెంట్ ప్రక్రియను వేగవంతం చేయాలని, అర్హుల జాబితాలను వెంటనే ఉన్నతాధికారులకు పంపాలని ఆదేశించారు. నిర్మాణాలకు అవసరమైన ఇసుక, ఇతర సామగ్రి సకాలంలో అందేలా చూడాలని సూచించారు. మిషన్ భగీరథ అధికారులు వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాపై ముందస్తు కార్యాచరణ రూపొందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని గౌతమ్ ఆదేశించారు.

## తల్లి పాలే శిశువులకు అమృతం

గండీడ్, (ప్రజాజ్యోతి: తల్లి పాల వారోత్సవాల సందర్భంగా గండీడ్ మండలంలోని వెన్నచేడు గ్రామంలో బుధవారం తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గుర్రాల నవనీత్ చెన్నయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, నవజాత శిశువులకు తల్లి పాలు అమృతంతో సమానమని అన్నారు. శిశువు జన్మించిన మొదటి గంటలోనే తల్లి పాలను ప్రారంభించడం ఎంతో అవసరమని, పుట్టిన తర్వాత మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వడం ద్వారా శిశువుల ఆరోగ్యం, శారీరక--మానసిక ఎదుగుదల, రోగనిరోధక శక్తి గణనీయంగా పెరుగుతాయని వివరించారు.గర్భిణీలు, బాలింతలు ఆరోగ్య శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని, తల్లి పాల ప్రాముఖ్యతను ప్రతి కుటుంబం గుర్తించి శిశువుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం తల్లి పాల వల్ల కలిగే ప్రయోజనాలు, సరైన పాలిచ్చే విధానం, శిశు సంరక్షణపై ఆరోగ్య సిబ్బంది వివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ చెన్నకేశవులు, జీపీఓ శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు. ప్రతి శిశువుకు తల్లి పాలు అందేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కార్యక్రమంలో పిలుపునిచ్చారు.



## ఆర్డీవో స్థాయిలో ప్రజావాణి అవసరం లేదు!

### - మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయి ప్రజావాణిలే సరిపోతాయి
### - సీఎం, ఉన్నతాధికారులు పునరాలోచించాలి: డాక్టర్ జీ. చిన్నారెడ్డి



**వనపర్తి, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):** రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో) స్థాయిలో ప్రజావాణి నిర్వహణ అవసరం లేదని, మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ప్రజావాణిలే సరిపోతాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని స్పష్టం చేశారు. ఆర్డీవో కార్యాలయాలు ఎక్కువగా కలెక్టరేట్ ఆవరణలోనే లేదా దాని సమీపంలోనే ఉంటాయని పేర్కొన్న ఆయన, మండలం--జిల్లా స్థాయి ప్రజావాణిల మధ్య మరోసారి ఆర్డీవో స్థాయిలో ప్రజావాణి నిర్వహించడం వల్ల ప్రత్యేక ప్రయోజనం ఉండదన్నారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను మరింత సరళీకృతం చేయాలంటే ఈ విధానాన్ని పునరాలోచించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఆర్డీవో స్థాయి ప్రజావాణి నిర్వహణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రణాళికా శాఖ ఉన్నతాధికారులు మరోసారి సమీక్షించి తగిన దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని డాక్టర్ చిన్నారెడ్డి కోరారు.

## భూ భారతి పోర్టల్‌పై అవగాహన పెంచుకోవాలి

### -జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 05 (ప్రజా జ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం భూ పరిపాలనలో సంస్కరణల కు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న భూ భారతి పోర్టల్ ద్వారా ప్రజలకు భూ సంబంధిత సేవలను వేగవంతంగా,పారదర్శకంగా,జవాబుదారీతనంతో అందించేందుకు రెవెన్యూ శాఖ సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ సమావేశ హాల్లో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధ్యక్షతన జిల్లా లోని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలలో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్లకు భూ భారతి పోర్టల్ నిర్వహణ,భూ భారతి చట్టం, ఆన్‌లైన్ దరఖాస్తుల పరిశీలన,పరిష్కార విధానంపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకతను పెంపొందించడం,ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా సకాలంలో సేవలు అందించడం,భూవివాదాలను తగ్గించే లక్ష్యాలతో భూ భారతి పోర్టల్‌ను రూపొందించిందన్నారు. ఈ లక్ష్యాల సాధనలో రెవెన్యూ శాఖ సిబ్బంది కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని భూ భారతి పోర్టల్‌కు సంబంధించిన ఎలాంటి సందేహాలు వచ్చినా సంబంధిత అధికారులను సంప్రదించి నివృత్తిచేసుకొని నిర్లక్ష్యానికి తావు లేకుండా పూర్తి జవాబుదారీతో పనిచేయాలని, కొన్నిసార్లు తెలియకుండానే తప్పులు జరిగే అవకాశం ఉంటుందని,అలాంటి సందర్భాల్లో తహసీల్దార్లు,అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి తన పనిని అత్యంత నిబద్ధత,ఏకాగ్రతతో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. దరఖాస్తుదారులకు స్లాట్ బుకింగ్,విచారణ తేదీ వివరాలను ముందుగానే తెలియజేస్తే వారు సమయపాలన పాటించేందుకు అవకాశం ఉంటుందని, ఈ విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని,భూ భారతి పోర్టల్ లాగిన్ వివరాలను గోప్యతగా ఉంచాలని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని,రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ పోర్టల్‌లోని అన్ని మాడ్యూళ్లపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని,భూ సంబంధిత దరఖాస్తులను నమోదు చేసే దశ నుంచి పరిష్కరించే వరకు ప్రతి చర్యను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వ హించాలని,ప్రజల నుంచి వచ్చే ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులో పరిష్కరించేలా శ్రద్ధ తీసుకోవాలని,సేవలందింపులో ఎలాంటి నిర్లక్ష్యం,జాప్యం చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చెన్నయ్య,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు అశోక్,హర్షవర్ధన్,ఆర్డీవో బన్సీలాల్,ఏవో చంద్రశేఖర్,రెవెన్యూ అధికారులు రెవెన్యూ డివిజనల్ అధికారులు,తహసీల్దార్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



# పాఠశాలల పురోగతే జిల్లా విజయానికి పునాది

## -పీజీఐలో రాష్ట్రంలో తొలి స్థానమే లక్ష్యం -పీజీఐలో 445 పాయింట్లు సాధించడమే లక్ష్యం -జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 05 (ప్రజా జ్యోతి)**

కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం విద్యారంగంలో రాష్ట్రాలు,జిల్లాల పనితీరును సుమారు 70 కీలక సూచికల ఆధారంగా అంచనావేసి ప్రకటించే పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ లో తెలంగాణ రాష్ట్రం దేశవ్యాప్తంగా 18వ,స్థానంలో నిలిచిందని,రాష్ట్రంలో నాగర్‌కర్నూల్ జిల్లా 333 పాయింట్లతో 9వ, స్థా స్థనంలో ఉందని నాగర్ కర్నూల్ జిల్లా రాష్ట్రంలో తొలి స్థానంలో నిలిపేందుకు అధికారులు లక్ష్యబద్ధంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు.బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ భవనంలో విద్యాశా ఖ పనితీరు,పీజీఐలో జిల్లాకు వచ్చిన మార్కులు, వివిధ సూచికల్లో సాధించిన పురోగతి,మెరుగుపరచాల్సిన అంశాలపై జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించి,ఈ సందర్భంగా అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో విద్యారంగ ప్రగతిని వివరించగా,కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలను చేశారు.2025--26 విద్యా సంవత్సరంలో 600 పాయింట్లకుగాను 333 పాయింట్లు మాత్రమే సాధించిందని 2026--27 విద్యా సంవత్సరంలో కనీసం 445 పాయింట్లు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.ప్రభుత్వపాఠశాలల్లో విద్యా నాణ్యత,మౌలిక వసతులు ప్రధాన లక్ష్యంగా ఉండాలని,విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పెంచడం,బోధన నాణ్యత మెరుగుపరచడం,ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను బలోపేతం చేయడం,పాఠశాలల్లో ఉత్తమ విద్యా వాతావరణాన్ని కల్పించడంవంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి,తరగతి గదులు,తాగునీరు, పారిశుద్ధ్యం,మరుగుదొడ్లు,విద్యుత్,ఫర్నిచర్,డిజిటల్ బోధన,ప్రయోగశాలలు,గ్రంథాలయాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని,ప్రతి పాఠశాలలో విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని,పీజీఐలో మెరుగైన ఫలితాలను సాధించాలంటే అన్ని సూచికలలో సమానంగా పురోగతి సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.విద్యార్థుల హాజరు,అభ్యాస ఫలితాలు,ఉపాధ్యాయ సామర్థ్యాభివృద్ధి,పాఠశాలల నిర్వహణ,మౌలిక సదుపాయాలు,విద్యా పరిపాలన,పర్యవేక్షణ,సమగ్ర ప్రణాళిక వంటి అన్ని రంగాల్లో ప్రత్యేక కార్యాచరణను చేపట్టాలన్నారు.ప్రతి మండలం,ప్రతి పాఠశాలను లక్ష్యంగా చేసుకుని కార్యాచరణను రూపొందించి వెనుకబడిన పాఠశాలలను గుర్తించి ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి చేయాలని మండల విద్యాధికారులు,ప్రధానోపాధ్యాయులు,అకాడమిక్ మానిటరింగ్ అధికారులు తరచూ పాఠశాలలను సందర్శిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించి,ప్రతి నెల పురోగతిని సమీక్షించి లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ విద్యా సంవత్సరంలో 600 పాయింట్లకు కనీసం 445 పాయింట్లు సాధించడం లక్ష్యంగా ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు.ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ దేవసహాయం,డిప్యూటీ సీఈవో గోపాల్ నాయక్,విద్యాశాఖ మానిటరింగ్ అధికారి కిరణ్ కుమార్,ప్లానింగ్ కోఆర్డినేటర్ నూరుద్దీన్, స్టాటిస్టికల్ అధికారి మాధవరెడ్డి,వెంకటేశ్వర్ల శెట్టి, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### -జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్

నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 05 (ప్రజా జ్యోతి)

రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు బుధవారం సైబర్ జాగ్రుక్త దివస్ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్.సంగ్రామ్ సింగ్ జి పాటిల్ జిల్లాలోని బ్యాంకర్స్, వివిధ అసోసియేషన్ సభ్యులను,సైబర్ క్రైమ్ బాధితులను జిల్లాఎస్పీ కార్యాలయం ఏర్పాటుచేసిన సమావేశంలో పలు సూచనలు సలహాలు ఇచ్చి సైబర్ బారిన పడిన వారిని పిలిపించి వారు ఎలా మోసపోయారు అనే విషయంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా అంతే వేగంగా పెరుగుతున్నాయని, వాటి పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా ఒకరి పేరుతో మరొకరు నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి మోసాలకు పాల్పడటం,క్రెడిట్ కార్డ్,డెబిట్ కార్డ్ వివరాలు,ఓటీపీలు సేకరించి బ్యాంకు ఖాతాలోని డబ్బులు కాజేయడం,ఆన్‌లైన్ షాపింగ్ సైట్ల పేరు తో నకిలీ ఆఫర్లను చూపిస్తూ ప్రజలను మోసం చేయడం,జిల్లాలో ప్రస్తుతం ఎక్కువగా జరుగుతున్న పెట్టుబడి మోసాలు,మరియు నకిలీ లోన్ యాప్‌ల ఉచ్చులో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు,ని రుద్యోగులను ఆశ చూపి డబ్బులు వసూలు చేసే ముఠాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అనంతరం జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్. వెంకటేష్ ఆధ్వర్యంలో సైబర్ బారిన పడబోమని ప్రతిజ్ఞ చేయించారు. ఎవరైనా సైబర్ క్రైమ్ కు గురైతేవెంటనే 1930 నెంబర్ కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని లేదా దగ్గర్లోని పోలీస్ స్టేషన్ వెళ్లి సైబర్ క్రైమ్ వారియర్ వద్ద ఫిర్యాదు చేయాలని,మీరు సైబర్ బారిన పడినట్టు మీకు తెలిస్తే 1930 తో పాటు మీయొక్క బ్యాంక్ అకౌంట్ ఏ బ్యాంకులో ఉందో ఆ బ్యాంక్ టోల్ ఫ్రీ నెంబర్ను తెలుసుకొని వారికి కూడా తెలియ చేయాలని అలాగే ఇక్కడికి వచ్చిన బ్యాంకర్స్ మరియు వివిధ అసోసియేషన్ అధ్యక్షులకు సైబర్ క్రైమ్ పై అవగాహన సదస్సులు నిర్వహించి వారిని సైబర్ బారిన పడకుండా మీ వంతు సాయం చేయాలని జిల్లా ఎస్పీ గారు కోరారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు,సైబర్ క్రైమ్ ఎస్ఐ గిరి, మనోహర్‌రెడ్డి,స్పెషల్ బ్రాంచ్ ఎస్సై రామ్ లాల్,డిసిఆర్ బిఎస్సై రమేష్,పైటికూర్ సిబ్బంది జిల్లా సైబర్ క్రైమ్ టీం సభ్యులు రవికుమార్,తేజశ్రీ,స్వాతి ఉన్నారు.




## పెన్‌డౌన్‌తో ఎంపీడీఓ సేవలు స్తంభింపు

**చిన్నంబావి,ఆగస్టు 5(ప్రజాజ్యోతి)**

చిన్నంబావి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ ఉద్యోగులు బుధవారం పెన్‌డౌన్--షట్‌డౌన్ నిరసన చేపట్టారు. జిల్లా జేఏసీ పిలుపు మేరకు విధులను బహిష్కరించిన ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఉద్యోగుల నిరసనతో ఎంపీడీఓ కార్యాలయంలో సేవలు పూర్తిగా స్తంభించడంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు, ప్రజాప్రతినిధులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆదర్శ్ గౌడ్‌కు ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఏపీవో ధనుంజయ రాజు మాట్లాడుతూ.. ప్రతి నెలా మొదటి తేదీన జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, పే స్కేల్ అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను తమకు కూడా వర్తింపజేయాలని కోరారు.జీతాలు సక్రమంగా అందకపోవడంతో కుటుంబ పోషణతో పాటు పిల్లల చదువుల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను సానుకూలంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓతో పాటు ఈసీ వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు మేకల గోపాల్ యాదవ్, కంప్యూటర్ ఆపరేటర్ భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## వికారాబాద్ జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడు యు. రమేష్ కుమార్‌కు గండీడ్ మండల బీజేపీ నేతల శుభాకాంక్షలు



గండీడ్, ప్రజాజ్యోతి: భారతీయ జనతా పార్టీ వికారాబాద్ జిల్లా నూతన అధ్యక్షులుగా నియమితులైన శ్రీ యు. రమేష్ కుమార్ గారికి గండీడ్ మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం ఆయనపై ఉంచిన నమ్మకానికి తగిన విధంగా సమర్థవంతమైన నాయకత్వాన్ని అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.యు. రమేష్ కుమార్ నాయకత్వంలో వికారాబాద్ జిల్లాలో భారతీయ జనతా పార్టీ మరింత బలోపేతమై, పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్లడంతో పాటు కార్యకర్తలకు అండగా నిలుస్తూ ప్రజాసేవలో విశిష్ట విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా వ్యాప్తంగా పార్టీని మరింత విస్తరింపజేసి, ప్రజల విశ్వాసాన్ని చూరగొనే దిశగా ఆయన విజయవంతంగా పనిచేయాలని కోరుతూ నూతన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మరోసారి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా గండీడ్ మండల బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ మోర్చాల పదాధికారులు, కార్యకర్తలు యు. రమేష్ కుమార్ గారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

### -ఎమ్మెల్సీ కూచకుళ్ళ దామోదర్ రెడ్డి



**నాగర్‌కర్నూల్: ఆగస్ట్ 05 (ప్రజా జ్యోతి)**

ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు వరం లాంటిదని ఎమ్మెల్సీ కూచకుళ్ళ దామోదర్ రెడ్డి అన్నారు.నాగర్ కర్నూల్ జిల్లా బిజిపల్లి మండల పరిధిలోని గంగారం గ్రామానికి చెందిన గుంటి శ్యామ్ సాగర్ ఆరోగ్య సమస్యతో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితి రావడం తో బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కూచుకు ళ్ల రాజేష్ రెడ్డికి పరిస్థితిని తెలిపి ఆర్థిక సహాయం అందించాలని కోరగా ఎమ్మెల్యే బాదితుడి విజ్ఞప్తిపై స్పందించి,3,00,000 ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు చేయించారు.ఇట్టి ఎల్.ఓ.సి లెటర్ ను ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి బుధవారం బాదితుడికి అందించారు.కార్యక్రమంలో హరీష్ రెడ్డి,వీరేందర్ రెడ్డి,తదిరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల చదువుకు ఊతమిచ్చే ఉచిత నోటు పుస్తకాలు

మల్దకల్,ఆగస్టు 5(ప్రజా జ్యోతి ప్రతినిధి):మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు తొలిసారిగా ఉచిత నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీలత రెడ్డి మాట్లాడుతూ,ఇంటర్మీడియట్ విద్యా చరిత్రలోనే తొలిసారిగా ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాల పంపిణీ ప్రారంభించడం శుభపరిణామమని అన్నారు ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం,ఇంటర్మీడియట్ విద్యా బోర్డుకు కళాశాల తరపున ఆమె కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు భాగ్యలక్ష్మి,రామాంజనేయులు గౌడ్,రాఘవేంద్ర,మాధురి,శ్రీకాంత్, సుధాకర్,రంగస్వామి,ఇష్తికర్ అహ్మద్‌తో పాటు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

